ఓం నమో భగవతే శ్రీ రమణాయ

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-10-2001, నర్సాపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

షిర్డీ సాయిబాబా సర్వదేవతాస్వరూపుడు. ఆయన కొంతమందికి రాముడిగా, కొంతమందికి దత్తాత్రేయుడుగా దర్శనమిచ్చారు, నాకు ఆంజనేయస్వామిగా దర్శనమిచ్చారు. ఆయనను కోరికలు నెరవేర్చే దేవుడుఅంటారు. బాబాఅంటే భగవంతుడే అని పరిపూర్ణమైన విశ్వాసంతో ఆయనను ఆరాధించినవారికి అనేక మహిమలు జరిగినాయి, వారి కోరికలుకూడా నెరవేరినాయి. బాబా శరీరం ఇప్పడులేదుఅని బాబాలేరుఅని అనుకోవద్దు. శరీరానికి మరణం ఉంటుందిగాని గురువుకు మరణంలేదు. బాబాశరీరం ఇప్పడులేదుఅని బాబాలేరుఅని అనుకొంటే జీవితంలో మనం చాలానష్టపోతాము. ఒక భక్తుడు బాబాగారిని ఏదోకోరిక అడుగుతూఉంటే ప్రక్కనఉన్న భక్తుడు ఎందుకు చిల్లరికోరికలు కోరుతున్నావు, ఆయన మోక్షం ఇవ్వగలసమర్ధుడు, మోక్షం అడుగు అనిచెపుతాడు. అప్పడు బాబాగారు అతనిని వారించి ఆయన ఏదోకోరిక అడుగుతున్నాడు అడగనియ్యి, కంగారుపెట్టవద్దు. ఆయన కోరికను నెరవేర్చినతరువాత అప్పడు ఆయన మొఖాన్ని మోక్షంవైపు త్రిప్పదాముఅని చెప్పారు. బాబాగారు ఏమిచెప్పారుఅంటే నేనుమీకు కొన్నికోరికలు నెరవేరుస్తున్నాను. మీకు ఆ కోరికలు నెరవేర్చాలిఅని ఆ కోరికలు నెరవేర్చటంలేదు. మీరుఏదైతే కోరుకోవాలిఅని నేను అనుకొంటున్నానో ఆకోరిక ఏనాటికయినా మీరుకోరుకొంటారుఅని ఈ చిల్లరకోరికలు నెరవేరుస్తున్నానుఅని చెప్పారు. మీకుఅందరికి మోక్షంకావాలి, ఆత్మజ్ఞానంకావాలి. మోక్షంవైపుకు మీమొఖం త్రిప్పటానికి ఈ చిల్లరకోరికలు నెరవేరుస్తున్నానుఅని బాబాచెప్పారు.

మనం పొందవలసింది మన హృదయంలోనేఉంది. అదేఆత్మ, అదేబ్రహ్మం, అదేచైతన్యం. దానిస్వరూపమేఆనందం, దానిస్వరూపమేశాంతి, దానిస్వరూపమే ఉండటం గురువుయొక్క చూపుద్వారాగాని, మాటద్వారాగాని ఒక జ్ఞానకణం నీకు అందిందా నీవు ఆ గూటిలోనికి వెళ్లిపోతావు. గురువుయొక్క మాటఅనుగ్రహం, చూపుఅనుగ్రహం, ప్రతీ కదలికఅనుగ్రహం, ఆయనదేహం ధరించి ఉండటమేఅనుగ్రహం. గడ్డిమేటి ఎంతపెద్దదిఅయినా దానిని కాల్చటానికి ఒక్క అగ్గిపుల్లచాలు. అలాగే నీలో ప్రారబ్దకర్మఎంతఉన్నా, ఎన్నిబలహీనతలుఉన్నా ఒక్కజ్ఞానకణం నీకుఅందినప్పడు ఆకర్మఅంతా భస్మమయిపోతుంది. అంతేకాదు ఈ జన్మలు, మరణాలు అన్నీ స్వప్న సమానమని నీకు తెలుస్తుంది. జ్ఞానకణం నీకు అందినప్పడు అది కర్మను అంతాకోసి,





కోసి నీహృదయంలోఉన్న వస్తువునుపట్టిఇస్తుంది. నేను చెప్పేమాటలు మీకు ఎలా ఉపయోగపడాలిఅంటే ఈ మాటలు మీ అహంకారమునకు కోతక్రింద ఉపయోగపడాలి అంతేగాని మీ అహంకారాన్ని ఉబ్బించేమాటలు నేను చెపుతూ, నా అహంకారాన్ని ఉబ్బించే మాటలు మీరు చెపుతూఉంటే ఎక్కడికి వెళతాము? చీకటిలోకాలకు వెళతాము. గురువుమాట అహంకారానికి కోత. ఇప్పడు మనం ఏదైతే నేను, నేను ఉంటున్నామో అదిమిధ్యానేను. అందులోనే కల్మషంఅంతాఉంది. ప్రపంచంలోఉన్న అశాంతికి ఈ నేనేకారణం. ఈనేను దేహంతోటి, మనస్సుతోటి, ప్రపంచంలోఉన్నవస్తువులతోటి, స్వార్ధంతోటి, మిత్రులతోటి కలిసిఉంటుంది. ఎవరు ఏమార్గంలో ప్రయాణంచేసినా ఈనేనునుండి విడుదలపొందాలి. ఈ నేనులోనుండి విడుదల పొందితేగాని నీహృదయంలోఉన్న సద్వస్తువు ఉన్నది ఉన్నట్లుగా నీకుతెలియబడదు. మన హృదయంలోఉన్న వస్తువును తెలుసుకోవటానికి మనలో చాలా ఆటంకాలు ఉన్నాయి. భగవంతుడిని స్మరించటంవలన, మహాత్ములను ఆరాధించటంవలన, గురువు చెప్పిన మాటలను ఆచరించటంవలన మనలోఉన్న ఆటంకాలుఅన్నీ తొలగిపోతాయి. మనకు ఉపయోగంలేని తలంపులు అనేకంవస్తూఉంటాయి. భగవంతుడి నామాన్ని స్మరించటంవలన ఆతలంపులుఅన్నీ తొలగిపోతాయి, చివరకు అదికూడాపోతుంది. అప్పడు లోపలఉన్న వస్తువుఉన్నదిఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. లోపలశివుడు ఉన్నాడు. ఆ శివబుద్ధి నీకు కలుగకుండా శవబుద్ధి అడ్డువస్తోంది. అందువలన శవబుద్ధిని తొలగించుకోవటం మీదే నీ సాధనను గురిపెట్టు. నీవుచేసేపూజ, జపం, ధ్యానం ఇవి అన్నీకూడా శవబుద్ధినుండి విడుదలపొందటానికి నీకు సహకరించాలి. నీవుస్వార్ధంలేకుండా, ఆడంబరంలేకుండా పనిచేస్తావుఅనుకో, ధ్యానంచేసినవారు ఏస్థితిని పొందుతారో నీవుకూడా అదేస్థితిని పొందుతావు. అహంకారమునకు మరోరూపమే శరీరంఅనిచెపుతారు. అహంకారం ఈ శరీరంలేకుండా ఉండలేదుకాబట్టి దానికి మరల శరీరంవస్తుంది. అదేపునర్జన్మ. దేహము, మనస్సు ఇవిఅన్నీ అహంకారముయొక్క రూపములే. అహంకారమే ఈ రూపాలు ధరించివస్తోంది అని మనకు అర్ధంకాకపోతే అహంకారముఅనే పిడికిలినుండి బయటకురాలేము. ఇష్టం, అయిష్టంకూడా అహంకారముయొక్క చేష్టలే. అహంకారంఉంటే నువ్వుఉన్నావు, నేనుఉన్నాను, పుణ్యంఉంది, పాపంఉంది, మరణానంతర జీవితంఉంది అదిలేకపోతే ఏదీలేదు, నీవేమిగులుతావుఅంటే శుద్ధచైతన్యంఒక్కటేమిగులుతుంది. జీవకోటిని

అక్కడికి తీసుకొని వెళ్ళటానికే బాబాగారి ప్రయత్నం. నాకు సన్మానంచేయాలిఅనుకోవటం అహంకారం, సన్మానంచేస్తాముఅంటే వద్దు, వద్దు అనటంకూడా అహంకారమే. అహంకారంయొక్క రూపంఎలాఉంటుందోచూడండి. వద్దు, వద్దు అనటం అవినయానికిగుర్తు. నీమాటలోగాని, నీచేతలోగాని ఎప్పడూ అవినయంరాకుండా చూసుకో, అదేసాధన. మాటలోగాని, చేతలోగాని హింసాప్రవృత్తి పనికిరాదు. హేళనగామాట్లాడటంకూడా హింసాప్రవృత్తే. నీవు మాట్లాడేమాట నీకుశాంతిని ఇవ్వాలి, ఇతరులకు శాంతినికలుగజేయాలి. అవసరంఉన్నప్పడు మాట్లాడాలి. అవసరంలేనప్పడు మాట్లాడటం ఎంతపొరపాటో, అవసరంఉన్నప్పడుమాట్లాడకుండా ఉండటంకూడా అంతేపొరపాటు.

అహంకారం అణిగిఉంటుంది. ఏదోతలంపు వచ్చినప్పడు దానితో తాదాప్యం పొందుతుంది. అది ఏతలంపుతో తాదాప్యంపొందుతోందో అదే మనకు నిజం అనిపిస్తుంది. దానికి అనుగుణంగా ఆడుతూఉంటుంది. మనం చూసుకుంటే తెలుస్తుంది. లోపల పరిశీలన అవసరం. మానవుడు అహంకారంకోసమే జీవిస్తున్నాడు, ఆత్మజ్ఞానంకోసం జీవించటంలేదు. మిమ్మల్ని ఎవరైనా పొగిడారుఅనుకోండి. పొగడ్తకుముందు మీరు ఎంత నిర్వికారంగాఉన్నారో, పొగిడినతరువాతకూడా అంత నిర్వికారంగాఉండాలి. మిమ్మల్ని ఎవరైనా విమర్శించారు అనుకోండి. విమర్శించకముందు మీరుఎంతనిర్మలంగాఉన్నారో, విమర్శతరువాతకూడా అంతనిర్మలంగా ఉండగలగాలి. అప్పడు మీరుఅహంకారరహితంగా జీవిస్తున్నారుఅని అర్ధం. దేహభావనలోనుండి ఈశ్వరభావనలోనికి రావటానికి బహుజన్మలకృషి అవసరం. నీవు పరమపవిత్రుడవుకావాలి, నీబుద్ధి సూక్ష్మంఅవ్వాలి. నీబుద్ధికి సూక్ష్మత్వంవచ్చినప్పడే నీహృదయంలో సూక్ష్మంగాఉన్న భగవంతుడు నీకు తెలియబడతాడు. మాకు శాంతిలేదు, మాకు శాంతిలేదు అంటారు. భగవంతుడిని చేరుకొనేవరకూ ఎవరికీ శాంతిలేదు. మనకు శాంతిస్థానం భగవంతుడే. ఆయనను చేరుకొనేవరకూ ఎవరికీ శాంతిలేదు. పరిస్థితులు అనుకూలంగాఉన్నా, ప్రతికూలంగాఉన్నా ఈశ్వరుడిపాదాలను విడిచిపెట్టకుండాఉంటే మనకు శాంతికలుగుతుంది. నేనుపుట్టానుఅనుకొనేవాడికి చావుఉంది, నేను చనిపోతున్నానుఅనుకొనేవాడికి పుట్టుకఉంది. ఏదిపుడుతోంది? శరీరంపుడుతోంది. నీవు శరీరం అనుకొంటున్నావు. కాబట్టి నేను పుట్టాను అనుకొంటున్నావు. నీవు నిజంగా శరీరం అయితే నేను శరీరమును అనుకొన్నా ఫరవాలేదు. నీవు శరీరం కాదు. కాని నేను శరీరమును అనుకొంటున్నావు. నీవుకానిదానిని నీవుఅనుకొంటున్నావు అదే ప్రమాదమును తీసుకొనివస్తుంది. ఇది మనం అర్ధంచేసుకోవాలి. ఇప్పడు మనం అందరమూపుట్టాము అనుకొంటున్నాము. పుట్టినవారు అందరూ చావటానికి సిద్దంగా ఉన్నారు. చనిపోయినవారు అందరూ పుట్టటానికి సిద్దంగా క్యూలోఉన్నారు. వారికీ మోక్షంలేదు, వీరికీ మోక్షంలేదు. పుట్టినది చనిపోతుంది. ఏదైతే పుట్టలేదో దానికి చావులేదు. ఆ పుట్టుకలేని వస్తువు నీ హృదయంలోనే ఉంది. నీహృదంలోఉన్న పుట్టుకలేని వస్తువు నీకు తెలిసినప్పడు అసలు నేను పుట్టలేదుఅన్న సంగతి నీకు అనుభవంలోనికి వస్తుంది. అదే నీకడసారిజన్మ.

దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టు. నీపనిఏదోనీవుచేసుకో. ప్రారబ్దంలో ఏదిరావలసిఉంటే అదివస్తుంది. నీపనిఏమిటిఅంటే ఆత్మజ్ఞానసముపార్జన, అదిచూసుకో. దేహానికి గౌరవంవస్తే పొంగిపోకు, అగౌరవంవస్తే కృంగిపోకు. ఇవిఅన్నీ దేహానికి సంబంధించిన విషయములు. దేహం ఎంతనిజమో ఇవిఅన్నీకూడా అంతేనిజం. నీదేహాన్ని, మనస్సును ఉపయోగించుకొని నీహృదయంలోఉన్న మరణంలేని వస్తువును తెలుసుకోవటానికి ప్రయత్నించు. మాయఎక్కడోఉంది, అజ్ఞానంఎక్కడోఉంది అనుకోకు. ఇవిఅన్నీ నేనురూపంలోఉన్నాయి. ఆనేనును తీసి ఒకప్రక్కనపెట్టు. నీవు ఏమార్గంలో ప్రయాణంచేసినా, ఏగురువును ఆశ్రయించినా ఈమిథ్యానేనులోనుండి విడుదలపొందు. నీవులావుగాఉన్నావుఅంటేకోపం, నీవుసన్నగాఉన్నావుఅంటేకోపం, నీవునల్లగాఉన్నావుఅంటేకోపం, నీకుబాగాఉందిఅంటేకోపం, నీకుఏమీలేదుఅంటేకోపం అంటే అహంకారం అనేకరూపాలుదాల్చుతోంది. కాని దానికిరూపంలేదు. అదిరూపంలేని పిశాచం. అందువలన వివేకంపెంచుకొని, సత్పురుషులసహవాసంచేసి, విచారణచేసి అందులోనుండి బయటకురా. చిల్లరవిషయాలు పట్టుకొని నీ కాలాన్ని, శక్తిని వృధాచేసుకోవద్దు. భగవంతుడు ఉన్నాడా, లేడాఅనే అనుమానం పెట్టుకోవద్దు. భగవంతుడుఉన్నాడుఅని సజీవమైన విశ్వాసం పెట్టుకొని ఆయనను అర్చనచేయండి. భగవదనుగ్రహానికి పాత్రులవ్వండి. ఒకసారి భగవాన్‌తో ఒకభక్తుడు మీరు కుమారస్వామి అవతారంఅంటున్నారు అనిఅంటే గుడిలో రాయినిపెట్టి రాముడుఅని, శివుడుఅని అంటున్నారు. అలాగే ఈ దేహాన్ని కుమారస్వామిఅంటే అనుకోనివ్వండి, ఇందులో ఏముందిఅన్నారు. ఎంత చిన్నవిషయంగా చూసారో చూడండి ఈ దేవతలు, చావులు, పుట్టుకలు ఇవిఅన్నీ దొంగనేనుకే. అదిపోతే అన్నీ అదృశ్యమయిపోతాయి అలాగని ఆయనకు దేవునిమీద గౌరవంలేదుఅనికాదు. చావుపుట్టకలులేని పరమసత్యంవైపుకు మనలను గెంటుకొని వెళ్ళటానికి చేసేప్రయత్నంఅది. వాడే నిజమైన గురువు.

20-11-2001

**రమణ భాస్కర**